మెయిర్ రోడ్డుపై మద్యం షాపును తొలగించాలి

వేరొక ప్రాంతానికి తరలించాలి

రాఘవాపురం వాసుల డిమాండ్

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్అండ్బి మెయిన్ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా పెట్టిన వైన్‌షాపును తొలగించాలని రాఘవాపురం ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్బి రోడ్డుకు 200 మీటర్ల దూరంలో ఉండాల్సిన వైన్‌షాపును ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మెయిన్ రోడ్డుపై పెట్టారని చెప్పారు. దీంతో అక్కడ మందుబాబులతో రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాఘవాపురం సచివాలయ ఉద్యోగికి, వైన్ షాపు నుంచి వస్తున్న వ్యక్తికి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేని చోట మద్యం షాపు పెట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

సందిగ్ధంలో సాగునీటి సంఘాల ఎన్నికలు..!

16న నోటిఫికేషన్ విడుదల అర్ధాంతరంగా వాయిదా

నేటికీ ప్రకటించని సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలు

ఎన్నికల నిర్వహణలో వెనుకడుగుపై రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అట్టహాసంగా ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం మౌనం వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా సాగుతోంది. 16వ తేదీన విడుదల కావాల్సిన నోటిఫికేషన్‌ను అర్ధాంతరంగా వాయిదా వేశారు. ఎందుకు వాయిదా వేశారు.. తిరిగి ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారో కనీస సమాచారం కూడా ఇవ్వని పరిస్థితి. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలను సాగదీస్తారా.. వెంటనే నిర్వహిస్తారా అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. విభజిత జిల్లాలవారీగా సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం చెప్పింది. దీంతో అందుకు సంబంధించిన ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 92 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మీడియం ఇరిగేషన్‌లో 11 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో 253 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఎన్నికైన కమిటీలు తమ్మిలేరు, ఎర్రకాలువకు సంబంధించిన రెండు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 98 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మైనర్ ఇరిగేషన్‌లో 14 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. యూజర్స్ కమిటీలు 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ కమిటీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోనున్నాయి. జిల్లాలవారీగా కమిటీల విభజనకు సంబంధించిన ప్రక్రియ ముగిసింది. ఎన్నికల నోటిఫికేషన్ మాత్రం జారీ కాలేదు. దీంతో ఎన్నికల నిర్వహణపై పలు అనుమానాలు నెలకొన్నాయి.

ఓటర్ల జాబితా ఏది?

ఎన్నికల నిర్వహణకు విధివిధానాలు ఉంటాయి. ముందుగా ఓటర్ల జాబితా తయారు చేయాలి. దానిపై అభ్యంతరాలను స్వీకరించి తర్వాత తుదిజాబితా ప్రకటించాలి. ఓటర్ల జాబితా సిద్ధమైన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నిర్వహణ ప్రక్రియ వంటివి సాగుతాయి. సాగునీటి సంఘాల ఎన్నికలపై మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. ఇప్పటి వరకూ సాగునీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేయలేదు. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాల్సి ఉంది. వాటర్ యూజర్స్ కమిటీ పరిధిలో ఉన్న ఆయకట్టును పరిగణనలోకి తీసుకుని ఎంతమంది రైతులు ఉన్నారో తేల్చాలి. జాబితాను తయారు చేసి అభ్యంతరాలు స్వీకరించాలి. పొలాలు విక్రయించిన వారి ఓట్లు ఉంటే వాటిని తొలగించి ఆ పొలం కొనుగోలు చేసిన రైతుల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చాలి. ఒక యూజర్ కమిటీ పరిధిలో ఎక్కువగా అనుకుంటే వెయ్యి ఎకరాల వరకూ ఉండొచ్చని అంచనా. 150 మంది రైతులు వరకూ ఉండొచ్చు. ఒక్కో జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ వాటర్ యూజర్స్ కమిటీలు 112 వరకూ ఉన్నాయి. అయినప్పటికీ ఇప్పటి వరకూ ఓటర్ల జాబితా ఊసే లేకుండాపోయింది. ఓటర్ల జాబితా విడుదల చేయకుండా నోటిఫికేషన్ తేదీ ఏవిధంగా ప్రకటించారో కూడా అర్థం కావడం లేదు. ఓటర్ల జాబితా ప్రకటించకుండా సాగునీటి సంఘాల ఎన్నికలు ఏవిధంగా నిర్వహిస్తారో అయోమయంగా మారింది. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాపై ఇప్పటి వరకూ జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించడంగాని, ప్రకటన విడుదల వంటివి కూడా చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తారా.. లేక మమ అన్పించేస్తారా అనే చర్చ సాగుతోంది. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను వెంటనే విడుదల చేయడంతోపాటు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

విద్యుత్ భారాలు మోపొద్దు

సిపిఎం ఆధ్వర్యాన సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు

బుట్టాయగూడెంలో...

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ట్రూఅప్ ఛార్జీల పేరుతో పేదలపై భారాలు మోపడం తగదని, తక్షణం ఆ ఆలోచన విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలన్నారు. ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూఅప్, సర్దుబాటు, అదనపు ఛార్జీల వసూళ్ల నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల వినియోగాన్ని వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇస్తామని చెబుతూనే పేదలపై భారాలు మోపడం తగదన్నారు. ప్రభుత్వం పేదలపై విద్యుత్ భారాలు మోపితే గత విద్యుత్ ఉద్యమం

కొయ్యలగూడెంలో...

పునరావృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నాయకులు మొడియం నాగమణి, తామా ముత్యాలమ్మ, ఎ.ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, ఉడతా వెంకటేష్, చంద్రు బుల్లెమ్మ, వెట్టి వీరయ్య, కె.భాస్కర్, టి,వెంకటలక్ష్మి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట విద్యుత్ భారాలను మోపబోమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్ఆర్‌పేటలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ

ఏలూరులో...

సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఛార్జీలు పెంచేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. వెంటనే ఆ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వైఎస్.కనకారావు, జి.శారద, కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: విద్యుత్ ఛార్జీల భారం మోపొద్దంటూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. అనంతరం సబ్‌స్టేషన్ ఇన్‌ఛార్జికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.శివకుమార్, త్రిమూర్తులు, మద్రి సుబ్రహ్మణ్యం, ఉద్దాటి వెంకన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి, కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలును అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు, రైతుల సంక్షేమానికి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన, ఫసల్ భీమా యోజన, పిఎం ఎంప్లాయిమెంట్ గ్యారంటీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సంసద్ ఆదర్శ్ యోజన, జల్ జీవన్ మిషన్, మాతృత్వ వందన యోజన, బేటి బచావో.. బేటీ పడావో, పరంపరాగత కృషి వికాస యోజన, గ్రామ సడక్ యోజన, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, నేషనల్ రూరల్ హెల్త్ మిషన్, పిఎం పోషణఅభియాన్ తదితర కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్ర భవనాలు, టాయిలెట్ల నిర్మాణం, సమగ్ర శిక్ష కార్యక్రమంలో అదనపు తరగతి గదుల నిర్మాణం, గ్రామ సడక్ యోజన పథకం కింద గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద మరిన్ని కార్యక్రమాలు వేతనాల పద్దు కింద చేపట్టి పూర్తి చేస్తే, జిల్లాకు మరిన్ని పనులు మంజూరయ్యే అవకాశం ఉందని, అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, డిపిఒ అనురాధ, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల జెడిలు హబీబ్ భాషా, నెహ్రూబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిఇఒ అబ్రహం, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు, ఎంఐపి పీడీ రవికుమార్, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, డ్వామా పీడీ కెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

మండవల్లిలో విస్తారంగా వర్షం

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లిలో శుక్రవారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం నుండి మబ్బులతో నిండిన ఆకాశం ఎనిమిది గంటల నుండి వర్షం ప్రారంభమైంది. సాయంత్రం వరకూ వర్షం కొనసాగింది. దీంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గన్నవరంలో సచివాలయానికి వెళ్లే రహదారి పూర్తిగా నీట మునిగింది. మండవల్లి లో జాతీయ రహదారిపై వెలమపేట రామాలయం రహదారి, కైకలూరు సందు, మూడు తాళ్లపాడు రైల్వేగేట్ రహదారితోపాటు ఎస్‌సి, బిసి కాలనీల్లోని రహదారులపైకి వర్షపు నీరు చేరింది.

పిహెచ్‌సితోపాటు రహదారి పూర్తిగా నీట మునిగింది. డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో మురుగునీరు వర్షపు నీటితో కలిసి దుర్వాసన వచ్చింది. రోడ్లపైకి చేరుకున్న నీటిని తొలగించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజన సాగు భూములకు హక్కు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోలవరం

గిరిజన సాగులో ఉన్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వింజరం రెవెన్యూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు ఆదివాసీ గిరిజన సంఘం సిపిఎం మండల కమిటీల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి బొరగం భూచంద్రరావు మాట్లాడుతూ 1/70 షెడ్యూల్ ప్రాంతమైన వింజరం రెవెన్యూ పరిధిలో గత 30 ఏళ్లుగా ఎల్‌టిఆర్ భూముల్లో సాగులో ఉన్న గిరిజనులు దఫాలుగా పట్టాల కోసం సాగు అడంగల్‌లో ఎక్కించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. ఇప్పుడు భూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా గత 30 ఏళ్లుగా సాగులో ఉన్న భూములకు సాగు పట్టాలు, సాగు అడంగల్‌లో పేర్లు నమోదు చేయించాలని తహశీల్దార్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మడివి చలపతి, మీడియం దేవి, రాజు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

టెట్ పరీక్షలకు 60 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఏపి టెట్-2024) శుక్రవారం 14వ రోజు ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 162 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 148 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన జిల్లా అధ్యక్షుడిగా చక్రాల అమర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో అమర్‌కుమార్‌ను నూతన అధ్యక్షుడిగా సమావేశానికి హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ మరింత విస్తృతంగా సభ్యత్వ నమోదును చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ఫ్యాక్టరీలు మూసివేయడంతో నిరుద్యోగులుగా మారిన వేలాదిమంది కార్మికులు ఆటో రంగంలో, ఇతర వాహనాల డ్రైవింగ్ రంగంలో జీవనం సాగిస్తున్నారన్నారు. ఏలూరు నగరం మూడున్నర లక్షల మందితో విస్తరించి ఉన్నా రవాణా సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రోజురోజుకి పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయలేని ప్రభుత్వం రవాణా రంగ కార్మికులపై మాత్రం అదనపు భారాలను మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రమాదాలు అంచున జీవనం సాగిస్తున్న రవాణా రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిఎన్ఎస్ 106(1)(2) చట్టాలు డ్రైవర్ల పాలిట ఉరితాడులా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు నగరంలో ఆటో కార్మికుల సమస్యలపై పోరాటాలను సాగించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ అధికారులు ఆటోలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను ఏర్పాటు చేయాలని, అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి ఓపెన్ బిడ్ ద్వారా ఏజెన్సీలను నియమించాలని, అవినీతికి తావు లేకుండా ట్రాఫిక్ నెంబర్లను ఆటో రిక్షాలకు కేటాయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది రవాణా రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణానికి రాయితీ రుణాలను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నేరాలను అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, ఆటోలపై ఇ-చలానాలను విధించేందుకు వినియోగించడం సహేతుకమైన చర్య కాదని స్పష్టం చేశారు. ఆటోలపై ఇ-చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ, నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి చంద్రశేఖర్, కోలా రాజా, ఎండి.చాన్‌బాషా, అడ్డాల రాజు, మేరుగు వీర రాఘవులు, నారాయణ పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తన కంపెనీల మోసాలు అరికట్టాలి

ఎపి రైతుసంఘం, విత్తన రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మొక్కజొన్న విత్తన రైతులకు సీడ్ కంపెనీల నుండి అగ్రిమెంట్లు ఇప్పించాలని, మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసాలు అరికట్టాలని, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ విత్తన రైతుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం, వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయం ముందు శుక్రవారం విత్తన రైతులు ధర్నా నిర్వహించారు. మొక్కజొన్న విత్తన రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా మొక్కజొన్న విత్తన ఉత్పత్తి పంట సాగవుతోందన్నారు. మొక్కజొన్న విత్తన కంపెనీలు ఆర్గనైజర్ల ద్వారా రైతులకు మొక్కజొన్న విత్తనాలు ఇస్తున్నారన్నారు. కంపెనీలు చెబుతున్న దిగుబడులు రాక ప్రతియేటా విత్తన రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు ఇచ్చే సందర్భంలో చెబుతున్న దిగుబడులకు, సాగు చేసిన తర్వాత వచ్చే దిగుబడులకు సంబంధం ఉండటం లేదన్నారు. అధిక దిగుబడులు వస్తాయని ఆశ చూపి రైతులతో విత్తన పంట సాగు చేయిస్తున్నారని వివరించారు. నష్టాలు వస్తున్న సందర్భాల్లో సీడ్ కంపెనీలు స్పందించకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను

మోసగిస్తున్నాయని విమర్శించారు. రైతులకు కంపెనీ నుండి ఎటువంటి అగ్రిమెంట్స్ ఇవ్వని కారణంగా రైతుకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన కంపెనీల నుండి రైతులకు అగ్రిమెంట్స్ ఇప్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విత్తన కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, రైతులు, విత్తన రైతు సంఘం, రైతు సంఘాల నాయకులతో జాయింట్ సమావేశం జరిపి విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజు మాట్లాడుతూ నేటికీ చాలాచోట్ల విత్తన రైతులకు పంట బకాయిలు అందలేదన్నారు. రైతులను మోసగించడం తగదన్నారు. ధర్నా అనంతరం సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఎఒ ఉదయ భాస్కరరావుకు, వ్యవసాయ శాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఘంటా పాపారావు, ఎం.లెనిన్, పాలేటి సుభాష్ చంద్రబోస్, బి.రాంబాబు, బి.గోవర్ధనరావు, ఆర్.మరియదాసు, పి.శోభనాద్రి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థినికి గాయాలు

ఆసుపత్రికి తీసుకెళ్లిన తోటి విద్యార్థులు

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు, తల్లిదండ్రుల నిలదీత

ప్రజాశక్తి - మండవల్లి

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థిని తలపై పడడంతో తీవ్ర గాయమైంది. ఈ ఘటన మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం... చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు శుక్రవారం యథావిధిగా హాజరయ్యారు. ఏడో తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న క్రమంలో ఒక్కసారిగా గదిలోని స్లాబ్ నుంచి పెచ్చులూడి జయమంగళ జయశ్రీ తలపై పడింది. దీంతో పాఠశాల గదిలోని పిల్లలు భయంతో బయటకు పరుగులు తీశారు. జయశ్రీ తలకు అయిన గాయాన్ని పరీక్షించిన ఉపాధ్యాయులు చిన్న దెబ్బేనని, తగ్గిపోతుందని నిర్లక్ష్యం వహించారు. జయశ్రీ తల నుంచి రక్తం కారుతుండడంతో తోటి విద్యార్థులు ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లగా బలమైన దెబ్బ తగిలిందని తెలియడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కైకలూరులోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానికులు, తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని విద్యార్థిని తలకు దెబ్బ తగిలిందని తల్లిదండ్రులకు చెప్పకపోవడం, ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం వహించడం, విద్యార్థులే జయశ్రీని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పెచ్చులూడి పడిపోతున్న గదిలో విద్యార్థులకు పాఠాలు ఎలా చెబుతున్నారంటూ నిలదీశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠాలు కన్నా కన్నబిడ్డలే మాకు ముఖ్యమని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పాఠశాలకు కూడా పంపబోమని వారు హెచ్చరించారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల్లో నెలకొన్న నిర్లక్ష్య వైఖరిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

విద్యార్థిని తలకు అయిన గాయం

టిడిపి నేత వెంకటేశ్వరరావు మృతి బాధాకరం

ఎంఎంసి మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి

పార్టీలకతీతంగా పలువురి సంతాపం

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు వంటి నాయకుడిని పార్టీ కోల్పోవటం బాధాకరమని ఎంఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. ఇటీవల చింతలపూడి పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వెంకటేశ్వరరావు (73) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ముత్తారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పక్కాల వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పోలీస్ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం టిడిపిలో సభ్యత్వం తీసుకుని పార్టీలో పని చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, ప్రతిపక్షంలో ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని పలువురు కొనియాడారు. ఆయన సేవలు పార్టీకి ఎనలేనివన్నారు. వెంకటేశ్వరరావు మృతదేహానికి టిడిపి మండలాధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, శేషగిరిరావు, మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, తాటి అప్పారావు, సింహ, ఇసుక శ్రీను, మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరినీ నవ్వుతూ పలకరించేవారని పరిచయస్తులు, బంధువులు మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ డి.పావని సందర్శించి నివాళులర్పించారు. పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని ప్రజలు అధికసంఖ్యలో తరలి వచ్చారు.



వెంకటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

సిపిఎం సంతాపం

వెంకటేశ్వరరావు మృతికి సిపిఎం మండలాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, నాయకులు సూర్యకుమార్ సంతాపం తెలిపారు. అందరితో స్నేహంగా ఉండేవారన్నారు. వెంకటేశ్వరారావు మృతికి సిపిఐ నాయకులు సంతాపం తెలిపారు.

జనసేన సంతాపం

మంచి వ్యక్తిని కోల్పోయామని వెంకటేశ్వరరావు మృతి పట్ల జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు సంతాపం తెలిపారు. అందరినీ అప్యాయంగా పలకరించేవారన్నారు.

దత్తత పిల్లలకు బంగారు భవిష్యత్ అందించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

దత్తత తీసుకున్న పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఏలూరు శిశుగృహం ద్వారా బేబి మహిమ (5 నెలలు)ను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన జగ్మిదర్ సింగ్, సోనాల్ కౌర్ అనే దంపతులకు కారా నిబంధనల మేరకు కలెక్టర్ సమక్షంలో దత్తత ఇచ్చారు. ఈ దంపతులు 2020లో ఆన్‌లైన్ ద్వారా కారా నిబంధనల మేరకు దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నారు. దత్తతకు ప్రతిపాదించిన బేబి మహిమను తమకు దత్తత కోసం కోరారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దత్తత తీసుకున్న చిన్నారికి విద్యాబుద్ధులు అందించి బంగారు భవిష్యత్ కల్పించాలని సూచించారు. అనాథ పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించేందుకు ప్రభుత్వం చట్టబద్ధంగా పిల్లలను దత్తత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కెవివిఎల్.పద్మావతి, డిసిపిఒ సిహెచ్.సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి - భీమడోలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్యం పాలు కాకుండా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. భీమడోలు హెల్త్ వెల్‌నెస్ కేంద్రం పరిధిలో శుక్రవారం పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కళ్యాణ మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పూరవీధుల్లో పర్యటించి ఆరోగ్య పరిశ్రమలు, దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు.

కొయ్యలగూడెం : మండలంలోని సరిపల్లిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెం పిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ముసునూరు

స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిఎల్.నిర్మలాదేవి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను దాత రాయ్యంకుల రామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని వలసపల్లి అంగన్వాడీ ఉపాధ్యాయులు ఎం.కృష్ణకుమారి చెప్పారు. మండల పరిధిలోని వలసపల్లి 142, 143 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి, గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లా పట్టభద్రులు వచ్చే నెల ఆరో తేదీ లోగా ఓటు నమోదు చేసుకోవాలని టిడిపి ముసునూరు మండల నాయకులు పొకనాటి సీతారామ్, గరికముక్కు నాని అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు ఉన్నాయని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మీ ఇంటి పక్క పరిసర ప్రాంతాల వారి వివరాలు కూడా తెలపాలన్నారు. అప్లికేషన్‌తో పాటు పూర్తి వివరాలు జిరాక్స్ కాపీలతో తహశీల్దార్ కార్యాలయంలో గాని నూజివీడు టిడిపి కార్యాలయంలో అందించడానికి మండలంలోని టిడిపి నాయకులు ఇవ్వాలని తెలిపారు.

'గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బండివారిగూడెం గ్రామపంచాయతీ సర్పంచి నాళం టిరీష అన్నారు. మండలంలోని బండివారిగూడెం పంచాయతీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీతాపేట నుంచి గంగినిచుపాలెం 600 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరు కావడంతో సర్పంచి నాళం టిరీష, కాశి దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు.

మండవల్లి :పల్లెలు ప్రగతి పథంలో నడవాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కూటమి నాయకులు బావారాల దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని పెరికీగూడెం గ్రామంలో భగీరిశ శ్రీనివాసరావు సహకారంతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెలు ప్రగతిని సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

ముదినేపల్లి : మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో సీసీ రోడ్లకు సర్పంచి సుధాబత్తుల వరలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బందిపై రాత్రి సమయాల్లో ఆకతాయిలు, మందుబాబులు లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్నారనే వార్తలు ఆందోళనను కలిగిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో 24 గంటలూ నడిచే ప్రభుత్వాసుపత్రుల్లో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో నైట్ డ్యూటీ మహిళా ఉద్యోగులకు రక్షణ లేక బిక్కుబిక్కు మంటూనే డ్యూటీ బాధ్యతలను నిర్వహిస్తున్నారని తెలిపారు. నైట్ వాచ్‌మెన్‌లను నియమించి మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

'ఆదివాసీల అరణ్య రోదన పట్టదా..?'

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆదివాసీల అరణ్య రోదన ప్రభుత్వానికి, పాలకులకు పట్టదా అని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్యవ కృష్ణచైతన్య ప్రశ్నించారు. మండలంలోని బంధపటినగర్‌లో శుక్రవారం శాఖ కార్యదర్శి సోడే నాగేష్ అధ్యక్షత శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు దుర్భర పరిస్థితుల్లో బతుకులు ఈడ్చుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పాలకులు స్పందించి ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేసి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి రమణ రావు, మండల కార్యవర్గ సభ్యులు మద్దిపల్లి రమణయ్య, పల్లాల భిక్షం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్త కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తన భర్త కనిపించడం లేదని ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం... దోసపాడు మండలంలోని దోసపాడు గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌కు, ముసునూరు మండల కాట్రేనిపాడు గ్రామానికి చెందిన మాధురికి వివాహమైంది. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన భార్యాభర్తలిద్దరు కలిసి కాట్రేనిపాడు వెళ్లారు. అక్కడ రెండు రోజులు ఉన్న అనంతరం 14వ తేదీన ప్రేమ్‌కుమార్ దోసపాడు అని చెప్పి వెళ్లిపోయారు. భార్య మాధురి 16వ తేదీన దోసపాడు వెళ్లగా ఆమె భర్త అక్కడికి రాలేదని తెలిసింది. ప్రేమ్‌కుమార్ కోసం బంధువుల ఇళ్ల వద్ద, తెలిసిన చోట్ల వెదికారు. ఎక్కడా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో మాధురి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పలువురిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

డ్వాక్రా సంఘాలకు సంబంధించిన బుక్ కీపర్ విషయంలో కాట్రేనిపాడులో ఇరు గ్రూపుల వారు గొడవ పడగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పెదగొల్ల సుర్యాపారావు, సిమెనులకు అదే గ్రామానికి చెందిన అమ్మర శ్రీలక్ష్మి, ప్రభుకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇరు గ్రూపుల వారు ఈ నెల 16వ తేదీ సాయంత్రం గొడవ పడి కర్రలతో కొట్టుకుని గాయాలపాలై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం రిపోర్ట్ ఆధారంగా ఇరు గ్రూపుల వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన సరిపల్లి పంచాయతీ పరిధిలోని హుకుంపేట చెరువులో చోటుచేసుకుంది. విఆర్ఒ అడపా రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నూతిరామన్నపాలెం గ్రామానికి చెందిన మడకం సురేష్ (30) శుక్రవారం ఉదయం చెరువులో చేపల వేటకు వెళ్లి ఆ సమయంలో చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని రోదించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రస్థాయిలో అండర్ - 14, 17 విభాగాల్లో హాకీ పోటీలకు నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు షేక్‌నాగూర్ మీరా సాహెబ్ శుక్రవారం తెలిపారు. విజేతలను అభినందించారు. స్టేట్ మీట్‌కు అర్హత సాధించిన బి.సత్యప్రకాష్, జి.ప్రకాష్, జి.శాంతకుమారి, పి.లోహితాకుమారి, జి.మోక్షజ్ఞ, జి.కుసుమ, బి.చిత్ర, ఎస్ఎం.అక్మల్, వి.లోకేష్, టి.శివదుర్గ, ఎం.శ్రీవల్లి, ఆర్.అంజలీదేవిలను వ్యాయామ ఉపాధ్యాయులు బి.రాణి, గొల్లపల్లి రామరావు, గ్రామస్తులు అభినందించారు.

బాలికా దినోత్సవ పోటీ విజేతకు రూ.3 వేల నగదు బహుమతి

బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన నారాయణపురం పాఠశాల విద్యార్థిని గొంతిన కావ్యశ్రీకి జిల్లా అధికారులు రూ.మూడు వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందించారు.

కామవరపుకోట : రాష్ట్రస్థాయి ఫుట్ బాల్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు మండలంలో తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరపల్లి మండలం పల్లంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో, పెదవేగి మండలం ఎపిఎస్ డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో ఫుట్ బాల్ పోటీల్లో మేడూరి పూర్ణ నాగ శివ సాయి, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీల్లో దామర్ల కృష్ణ సాయి, నాగసాయి, అండర్-17 విభాగంలో సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీల్లో సోడిమెల్ల రాజశేఖర్, వెన్నెల హేమంబర వాసు ఎంపికైనట్లు, వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆగిరిపల్లి :మండల పరిధిలోని ఈదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొర్రుముచ్చు అభిలాష్ (8వ తరగతి) రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎన్.శారద తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో విజయవాడ పటమట హైస్కూల్‌లో జరిగిన వాలీబాల్ పోటీల్లో గొర్రుముచ్చు అభిలాష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో గొర్రుముచ్చు అభిలాష్‌ను, వ్యాయమ ఉపాధ్యాయురాలు ప్రమీలరాణిని గ్రామ సర్పంచి దొండపాటి అనిత, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కె.అంజయ్య, ప్రధానోపాధ్యాయురాలు శారద అభినందించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడొద్దు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అనేది సామాజిక రుగ్మతగా మారిందని, అటువంటి పద్ధతులను వీడనాడాలని ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ క్రాంతిప్రియ యాంటీ ర్యాగింగ్‌పై వైద్య విద్యార్థులతో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమన్నారు. ఏదైనా కేసుల్లో ఉంటే విద్యార్థుల ఉన్నత భవితకు తీవ్ర విఘాతంగా మారుతుందన్నారు. విదేశీ విద్య, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, విదేశాల్లో ఉద్యోగాలకు ఆటంకంగా మారతాయని తెలిపారు.

జెవివి ఆధ్వర్యాన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ముసునూరు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించినట్లు చెకుముకి టాలెంట్ టెస్ట్ కన్వీనర్ డి.రత్నమాల తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో విజేతగా ముసునూరు మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.చైతన్య, కె.నందిని కె.శ్రీవిత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం డి.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో గెలిచిన ముసునూరు పాఠశాల విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఫ్రాన్సిస్, నాగేశ్వరరావు, శివ నాగమణి, సుధారాణి అభినందించారు.

'మహిళలకు మద్యం షాపుల కేటాయింపు సనాతన ధర్మమా'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళలకు మద్యం షాపులు కేటాయించడం సనాతన ధర్మమా అని మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు మద్యం షాపులు కేటాయించడం వారి రాజకీయ సంకుచిత ధోరణికి నిదర్శనమని తెలిపారు. మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే త్వరలో ప్రకటించే అన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీలో వారికి పురుషులతో సమానంగా సముచిత స్థానం ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు.

కళాశాల బస్సు అడ్డగింత

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలకేంద్రమైన పెదవేగిలో ఏలూరు రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల బస్సును గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ పిల్లలను తీసుకువెళ్తున్న బస్సుల కండిషన్‌పై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల్లో 25 నుంచి 40 వరకు మాత్రమే సిట్టింగ్ సామర్థ్యం ఉండగా 60 మంది విద్యార్థులను ఎందుకు ఎక్కించుకుంటున్నారని ప్రశ్నించారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పెద్ద మొత్తంలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కించుకోవడంతో గతంలో చోదిమెళ్ల, వేగవరం రోడ్డులో కళాశాల బస్సు ప్రమాదానికి గురైందని, ప్రాణనష్టం లేకపోవడంతో ఇబ్బంది కలగలేదన్నారు. ఇప్పుడు అలాంటి సంఘటన జరిగితే ఎలాంటి నష్టం జరుగుతుందో అంచనా వేయలేమన్నారు. ఆర్‌టిఎ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకు వేలు ఫీజు కడుతున్న తమ పిల్లలను పరిమితికి మించి బస్సులో ఎక్కిస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

విద్యా ప్రమాణాల స్థాయి మరింత పెరగాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు అర్బన్ :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మరింత పెరగాలని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో కస్తూరిబా మున్సిపల్ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఫోర్ట్ మోడల్ స్కూళ్లలోని మధ్యాహ్న భోజన పథక అమలుపై రత్నప్రసాద్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం, మంచి నీటి సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు ఫోర్ట్ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, పరిసరాల పరిశుభ్రతపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, యువత అభ్యున్నతితో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య, నాణ్యత కూడిన పౌష్టికా హారాన్ని మధ్యాహ్న భోజనం ద్వారా అందేలా పర్యవేక్షం చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యా యులందరూ పిల్లల చదువులతో పాటు వారి ఆరోగ్యం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి చూపాలని సూచించారు. తాను తరచూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తానని, లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు పాల్గొన్నారు.

రీసర్వేలో భూముల హెచ్చుతగ్గులను సరిచేయండి

వెల్లమిల్లిలో రీసర్వేపై రెవెన్యూ సదస్సులో రైతుల మొర

ఉంగుటూరులో...

ప్రజాశక్తి - ఉంగుటూరు

భూ - విస్తీర్ణం, తేడాలు, జాయింట్ భూముల విభజన, వారసత్వ పేర్ల నమోదు తదితర సమస్యల పరిష్కారం కోసం రీ- సర్వేపై గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు తహశీల్దారు వై.పూర్ణచంద్రప్రసాద్ కోరారు. వెల్లమిల్లిలో రీ-సర్వే భూసమస్యల పరిష్కార దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్నిశుక్రవారం నిర్వహించారు. సర్పంచి వస్కా కుమార్‌రాజా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతులు ఉమ్మడి కుటుంబాల్లో అన్నదమ్ముల పొలాలను ఒకే వ్యక్తి పేరున నమోదు చేశారని, వాటిని సరిచేయాలని కోరారు. పొలాల సరిహద్దులు, వాటి భూ యజమానులను సక్రమంగా గుర్తించకపోవడం పట్ల రైతులు దరఖాస్తులు అందించారు. పట్టాదారు పాసు పుస్తకాలు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటికైనా వాటిని అందించాలని రైతులు కోరారు.

ముసునూరు :మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు తహశీల్దార్ ఎం.శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి మాట్లాడుతూ 2020 సంవత్సరానికి ముందు రెవెన్యూ రికార్డులో భూమి ఎలా ఉందో అలాగే ఆ రైతులకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా ప్రభుత్వం అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

చింతలపూడి :గ్రామ సభల ద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చింతలపూడి తహశీల్దార్ డిఎల్.ప్రమద్వర అన్నారు. మండలంలోని రీ సర్వే జరిగిన గొన్నెపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఏడు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

దెందులూరు :రీ సర్వే గ్రామసభ మండలంలోని మేదినరావుపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ స్వామి, మండల సర్వేయర్, ఇతర సిబ్బంది పాల్గొని వినతి పత్రాలు స్వీకరించారు.

భీమడోలు : రెవెన్యూ రీ సర్వే గ్రామసభల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి షేక్ రహీమా బేగం హుసేన కోరారు. పొలసానిపల్లిలోని, రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. అభ్యంతరాలపై వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తహశీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ పొలసానపల్లిలో ఇప్పటికే 1332 భూకమతాలకు చెందిన 2,167 ఎకరాల విస్తీర్ణంలో సర్వే కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో నూజివీడు ఆర్‌జియుకెటి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సంపాదించారు. ఈ విషయాన్ని పెర్ఫార్మింగ్ గార్డ్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి మంగళగిరి శ్రీధర్ తెలిపారు. ఈ విద్యార్థులను నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్, పరిపాలన అధికారి బి.లక్ష్మణరావు, డీన్ అకాడమిక్స్ రత్నాకర్ అభినందించారు.

చింతలపూడి :చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ప్రశంసించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన యువజన సర్వీసుల శాఖ సెట్ వెల్, ఏలూరు జిల్లా వారు థి మిటిక్, సాంస్కృతిక అంశాలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆ కళాశాల విద్యార్థులు పాల్గొని రకరకాల నైపుణ్యాలను ప్రదర్శించి వారి ప్రతిభను చాటుకున్నారు. జానపద నృత్యాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని, తెలుగు సాహిత్యానికి సంబంధించిన కవితల్లో ద్వితీయ స్థానాన్ని సంపాదించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇందుకు ఉపాధ్యాయుల కృషి ఉందని హర్షం వ్యక్తం చేశారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఆగిరిపల్లి :విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను కూడా సమన్వయం చేసుకొని విద్యాభ్యాసాన్ని పరిపూర్ణంగా చేసుకోవాలని జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన చెకుముఖి సైన్స్ సంబరాలు-2024లో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల వల్ల మానసిక, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, పోటీతత్వం, పట్టుదల, స్వీయ నిర్ణయాలు తీసుకుని సామర్థ్యం పెరుగుతాయన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ, దేశానికి పేరు ప్రతిష్టలను తీసుకురావడంలో క్రీడల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాసరెడ్డి, హీల్ అంధ పాఠశాల ఇన్‌స్ట్రక్టర్ ఎస్.రుష్మంత్ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన గోపాల్

ప్రజాశక్తి - కామవరపుకోట

వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండలంలోని జీలకర్రగూడేనికి చెందిన గోరుముచ్చు గోపాల్ శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు గోపాల్ తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రముఖ సినీ నిర్మాత డాక్టర్ కెఎల్.నారాయణ ఆదేశాల మేరకు మండలంలోని పెదగొన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్లను శుక్రవాం కూటమి నాయకులు జెసిబితో బాగు చేయించారు. పెదగొన్నూరు గ్రామ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలను, ముళ్ల చెట్లను జెసిబితో బాగుచేసి శుభ్రం చేసే పనులను గ్రావెల్ సహకారంతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడంకి శిరీష రాజేష్, విఆర్ఒ పి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి గిరిజ పాల్గొన్నారు.

కిశోర బాలలకు అవగాహన

మండవల్లి :మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి తెలిపారు. భైరవపట్నం ప్రాథమిక పాఠశాలలో కిశోర బాలలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

'రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను రద్దు చేయాలి'

ఏలూరు అర్బన్ :ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తారీకు వరకు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ పేరుతో విజయవాడలో ఆరు రోజులపాటు నిర్వహించనున్న రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డి మాట్లాడుతూ ఈ విధంగా ఆరు రోజులపాటు ఉపాధ్యాయులు కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. ఈ ట్రైనింగులను రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చి ప్రతి మండలస్థాయిలో పాఠశాల సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని కోరారు.

భీమవరం పురపాలక సంఘం

'e' ప్రొక్యూర్మెంట్ నోటిఫికేషన్

ఆర్.ఒ.సి. నెం. 12(1744533)/2019-డి.బి   ది. 18-10-2024

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో టెండరు నోటీసు నెం.15(1-4)/BHI/General/2024-25/E2 షార్టు టెండరు నోటీసు నె.15(5-8)BHI/General/2024-25/E21/E2 లోని జనరల్ ఫండ్స్ నుండి 5 పనులకు సంబందించి 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నె. 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబబుచున్నవి. మిగిలిన వివరములు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు మార్కెట్టు E2W.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి

బహిరంగ వేలం ప్రకటన

ఓ.క. నెం.44/2024   తేది.18-10-2024

ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖల ఐటమ్ లకు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది. 25-10-2024వ తేది శుక్రవారం ఉదయం 11.00 గం॥లకు ఆగిరిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు సంబందిత తహసీల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 30,00,000/- లకు సాల్వేన్సి ధృవీకరణ మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తము లో వెంటనే చెల్లించు విధానము ననుపరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొనవచ్చును.

వరుస నెం	అయిటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు	కాలపరిమితి
1	కురివిడి చెరువు	10000/-	2024-2026
2	ఫీదరు చెరువు	10000/-	2024-2026

సం/- పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి ఆగిరిపల్లి

నూజివీడు ఆర్‌జియుకెటిలో వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి, టిహాన్ ఐఐటి హైదరాబాద్ వారి సహకారంతో నూజివీడు క్యాంపస్‌లో ఆన్సిస్ ఆఫ్ రోడ్డు వెహికల్ డిజైన్, అనాలసిస్‌పై వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ఈ వర్క్‌షాపు అటానమస్ ఆఫ్ రోడ్డు కార్గో వెహికల్ ప్రాజెక్టులో భాగమైన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద నిర్వహించారు. వర్క్‌షాపునకు కీనోట్ స్పీకర్లుగా ఎన్ఐటి, రూర్కెలా నుంచి డాక్టర్ స్వప్నిల్, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇఫ్తికర్ హుస్సేన్ హాజరయ్యారు. ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఉదయ్‌కుమార్, కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్స్ డాక్టర్ రియాజ్ హుస్సేన్, డాక్టర్ భానుకిరణ్ ఈ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జియుకెటి డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్యాంపస్‌లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం ఎంతైనా అవసరమన్నారు. మూడు రోజుల ఈ వర్క్‌షాపు జరగనుందని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపరస్తులు నా క్లయింటు అయిన చంపాటి నరశింహరాజు గారి కుమారుడు చంపాటి రామరాజు గార్కి గల 8328/2014 మరియు 1230/2009 అను ఈ రెండు దస్తావేజులు ది.10-10-2024వ తేదీన కొవ్వలి నుండి ఏలూరు వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ సత్రంపాడు మార్గంమధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఎ. మణికుమార్
అడ్వకేట్
వట్లూరు, ఏలూరు
సెల్: 94416 40035

సర్టిఫికెట్లు పోయినవి

నూజివీడు పట్టణ కాపురస్తులు, డో.నెం.24/58(ఎ), కోనేరుపేట, వాస్తవ్యులు పురాణం శ్యామ్‌కుమార్ గారి కుమారుడు శ్రీకాంత్ తెలియజేయునది ఏమనగా..,

నేను ది.25-09-2024వ తేదీ సోమవారం ఉదయం 11:00 గంటలకు నూజివీడులోని రాజీవ్ సర్కిల్ నుండి కోనేరుపేటలోని మా ఇంటికి బైక్ పై వెళ్ళుతుండగా నా బైకుపై ఉన్న కవర్‌లో నాతాలూకు ఇంటర్మీడియట్ మార్కులు లిస్టు, లాంగ్ మెమో ఉన్న కవరుతో సహా జారి పడిపోయినది. నూజివీడు మరియు పరిసర ప్రాంత ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఆ సర్టిఫికెట్ ఎవరికైనా దొరికిన ఎడల నాకు గాని లేదా నూజివీడు పట్టణ పోలీసు వార్కి గాని అందజేయగలరు.

పురాణం శ్రీకాంత్
తండ్రి: శ్యామ్ కుమార్, కోనేరుపేట,
నూజివీడు. సెల్: 80742 12125

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 29/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ....వాది
అండ్
అంగులూరి సాయిసోధన్ వగైరా ....ప్రతివాదులు
టూ:
2వ ప్రతివాది:- మీనాక్షి లలిత శివ జ్యోతి, భర్త: వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1-52-23/1, RTC కాంప్లెక్స్ వెనుక, సిపాయిపేట, తాడేపల్లిగూడెం.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంక్ వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 1వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది. 25-10-2024 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది. 25-10-2024 సం. తేదిన ఉదయం గం॥ 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం, B.Com, B.L.,
అడ్వకేట్, నరసాపురం, ప॥గో॥జిల్లా
స్టాండింగ్ కౌన్సెల్ ఫర్ బ్యాంక్ ఆఫ్ బరోడా
నరసాపురం   నరసాపురం బ్రాంచ్
ది: 03-10-2024

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 33/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ....వాది
అండ్
తోట దుర్గా ప్రసాద్ వగైరా ....ప్రతివాదులు
టూ:
1వ ప్రతివాది:- తోట దుర్గా ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాలవారి వీధి, రామారావుపేట, తాడేపల్లిగూడెం.
2వ ప్రతివాది:- తోట దుర్గాదేవి, భర్త: దుర్గా ప్రసాద్, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాలవారి వీధి, రామారావుపేట, తాడేపల్లిగూడెం.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంక్ వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన శ్రీ నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రతివాదులు అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది. 07-11-2024 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది. 07-11-2024 సం. తేదిన ఉదయం గం॥ 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం, B.Com, B.L.,
అడ్వకేట్, నరసాపురం, ప॥గో॥జిల్లా
స్టాండింగ్ కౌన్సెల్ ఫర్ బ్యాంక్ ఆఫ్ బరోడా
నరసాపురం   నరసాపురం బ్రాంచ్
ది: 03-10-2024